క్లుప్తంగా

ఆస్పత్రి సూపరింటెండెంట్ మానవత్వం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ఓ వ్యక్తి రాత్రి వేళ మరణించడంతో మృతదేహాన్ని ఇంటికి పంపేందుకు అంబులెన్స్ అవసరం కాగా అప్పటికప్పుడు అధికారులు మహాప్రస్థానం వాహనాన్ని ఏర్పాటు చేశారు. మద్దికెర మండలం పెరవలి గ్రామానికి చెందిన కురువ ఈరన్న ఐదు రోజుల నుంచి అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రాత్రి ఆయన మరణించడంతో కుటుంబసభ్యులు అంబులెన్స్ కోసం ప్రయత్నించారు. ప్రైవేటు అంబులెన్స్‌ను మాట్లాడగా రూ.15 వేలు అడిగారు. విషయం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డికి తెలియడంతో మృతదేహాన్ని తీసుకెళ్లేందుకు మహాప్రస్థానం అంబులెన్స్‌ను ఏర్పాటు చేశారు. అంబులెన్స్ సేవలు ఉచితమని, ఏదైనా ఇబ్బంది ఏర్పడితే సంబంధిత అధికారులను కలిసి ఉచిత సేవలను పొందవచ్చని డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి సూచించారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి



మాట్లాడుతున్న సి.గురుశేఖర్

కర్నూలు(సెంట్రల్): రజక, లాండ్రీ వృత్తిదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గురుశేఖర్ డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం అమలుచేయాలని కోరారు. గురువారం వీరనారి ఐలమ్మ కార్యాలయంలో.. రజక వృత్తిదారుల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడతూ.. 2024 సాధారణ ఎన్నికలకు ముందు బీసీ తరగతులకు సామాజిక రక్షణ చట్టం చేస్తామని, 50 ఏళ్లు నిండిన ప్రతి వృత్తిదారుడికి వృద్ధాప్య పెన్షన్ ఇస్తామని, రజకుల అభివృద్ధి కోసం సంక్షేమ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని చెప్పిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రీనివాసులు, శేషాద్రి, సి.రాముడు, జయమ్మ, ఎల్లయ్య, శేఖర్‌బాబు, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

బీజేవైఎం లీగల్‌సెల్ కన్వీనర్‌గా పులిరాజు

కర్నూలు కల్చరల్: భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) లీగల్‌సెల్ కన్వీనర్‌గా వెంగోటి పులిరాజు నియమితులయ్యారు. ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కేశవరామ్ చౌదరి నియామక పత్రాన్ని విడుదల చేశారు. పార్టీ, యువ మోర్చా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని, బలోపేతం చేయాలని నియామక పత్రంలో పేర్కొన్నారు.

వార్డెన్లను నియమించాలి

కర్నూలు(సెంట్రల్): సంక్షేమ హాస్టళ్లకు వార్డెన్లను నియమించాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్రబాబు, అఖండ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం డీఆర్వో కె.మధుసూదన్‌రావును ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఇప్పటికే చాలా హాస్టళ్లకు వార్డెన్‌లు లేకపోవడంతో ఇన్‌చార్జ్‌లకు బాధ్యతలు అప్పగించారన్నారు. దీంతో వారు రెండు చోట్లా విధులను సమన్వయం చేయడంలో ఇబ్బందులు పడుతుండడంతో విద్యార్థులకు సరైన మెనూ, మౌలిక సదుపాయాలుకల్పించలేకపోతున్నారన్నారు. మరో వైపు సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలను నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో రమణ, దామోదర్, శంకర్, అనిల్ పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



రమేష్ బాబు

కర్నూలు కల్చరల్: కర్నూలు రూరల్ మండల తహసీల్దారుగా టీవీ రమేష్‌బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. బుధవారం జరిగిన తహసీల్దార్ల బదిలీల్లో భాగంగా రమేష్ బాబును కర్నూ లు రూరల్ మండలానికి బదిలీ చేశారు. దీంతో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబుకు కార్యలయ ఉద్యోగులు, పలువురు ప్రజా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల నిలిపివేత

- హిటాచీ, రెండు టిప్పర్ల సీజ్



హిటాచీ, రెండు టిప్పర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): కోడుమూరు నియోజకవర్గంలోని గూడూరు మండలం కొత్తురు గ్రామ సమీపంలో వక్కెర వాగు వద్ద అనుమతి లేకుండా పెద్ద ఎత్తున గ్రావెల్ తవ్వకాలు చేపడుతుండటంతో మైనింగ్ అధికారులు దాడులు చేశారు. తవ్వకాలు నిలిపివేసి ఒక హిటాచీ, రెండు టిప్పర్లను సీజ్ చేసి నాగులపురం పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు జిల్లా గనులు, భూగర్భ శాఖ ఉప సంచాలకులు రాజశేఖర్ గురువారం సాయంత్రం వెల్లడించారు. దాడుల్లో రాయల్టీ ఇన్‌స్పెక్టర్లు, మైనింగ్ సిబ్బంది హుస్సేన్, శంకర్, మధు పాల్గొన్నారు.

జనం చూపు బీఎస్ఎన్ఎల్ వైపు..

- ప్రైవేటు కంపెనీలు టారిఫ్ ధరలు పెంచడమే కారణం
- తక్కువ ధరకు టారిఫ్‌లు ఇస్తున్న ప్రభుత్వ రంగ సంస్థ
- క్రమంగా పెరుగుతోన్న బీఎస్ఎన్ఎల్ వినియోగదారుల సంఖ్య
- ఆగస్టు 15 నుంచి 4జీ సేవలు





బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, బీఎస్ఎన్ఎల్ కార్యాలయంలో కనెక్షన్లు పొందేందుకు జనం రద్దీ

కర్నూలు(హాస్పిటల్): మొబైల్ ఫోన్ ఇప్పుడు దాదాపు అందరి చేతిలోనూ ఒదిగిపోయింది. ఇది లేకుండా ఒక్క నిమిషం కూడా ఉండలేని పరిస్థితికి ప్రజలను నెట్టేసింది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ప్రతిఒక్కరూ దీనికి దాసులే. అందులో ఇంటర్‌నెట్ ద్వారా సోషల్ మీడియాలో వచ్చే రీల్స్ చూస్తూ, ఫేస్‌బుక్, వాట్సాప్‌లలో లైక్‌లు, కామెంట్లు పెడుతూ కాలం తెలియకుండా జీవిస్తున్న వారి సంఖ్య ఎక్కువే. ప్రజల అలవాటును అలుసుగా తీసుకున్న ప్రైవేటు టెలికాం కంపెనీలు ఇటీవల ఇబ్బడిముబ్బడిగా టారిఫ్‌లు పెంచేశాయి. దీంతో చౌకగా టారిఫ్‌లు లభించే భారత ప్రభుత్వ సంస్థ బీఎస్ఎన్ఎల్ వైపు అందరి చూపు మళ్లుతోంది.

భారత సంచార్ నిగమ్ లిమిటెడ్ (బీఎస్ఎన్ఎల్) సంస్థ సేవలు పొందాలంటే ఒకప్పుడు చాలా మంది పెదవి విరిచేవారు. ఇప్పుడు అదే బీఎస్ఎన్ఎల్ సేవలు కావాలంటూ పరుగులు తీస్తున్నారు. ఇప్పటివరకు ప్రైవేటు కంపెనీల నుంచి వస్తున్న పోటీని తట్టుకోలేక చతికిలబడిన ఈ సంస్థ ప్రస్తుతం ప్రైవేటు కంపెనీలు అమాంతంగా టారిఫ్‌లు పెంచేయడంతో కస్టమర్లను ఆకర్షిస్తోంది. గత కొన్ని రోజులుగా బీఎస్ఎన్ఎల్ కార్యాలయాలు, ప్రత్యేక శిబిరాల వద్ద జనం అధిక సంఖ్యలో కనిపిస్తుండటమే దీనికి నిదర్శనం. ప్రైవేటు కంపెనీల కంటే టారిఫ్‌లు తక్కువగా ఉండటమే దీనికి కారణం. నెలకు రూ.200 రీచార్జితో ఇతర కంపెనీల వినియోగదారులను బీఎస్ఎన్ఎల్ తన వైపు తిప్పుకుంటోంది. ఇదే సమయంలో ప్రైవేటు నెట్‌వర్క్‌లో నెలకు రూ.349 దాకా ఖర్చు అవుతోంది. ఇది సామాన్యులకు భారంగా మారింది. అందుకే బీఎస్ఎన్ఎల్ వైపు ఎక్కువ మంది తిరిగి చూస్తున్నారు. సాధారణంగా ప్రతి నెలా 5 వేల నుంచి 6 వేల కనెక్షన్లు ఇచ్చే బీఎస్ఎన్ఎల్ గత నెల ఏకంగా 18 వేల కనెక్షన్లు ఇచ్చిందంటే దానికి వస్తున్న డిమాండ్‌ను అంచనా వేయవచ్చు. డిమాండ్‌కు తగ్గట్లుగా కర్నూలు, నంద్యాల జిల్లా పరిధిలో బీఎస్ఎన్ఎల్ సంస్థ దాదాపు 400 టవర్ల ద్వారా 4జీ సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. మొదటి విడతలో 90 టవర్లను 4జీ టవర్లుగా మారుస్తోంది. మిగతా వాటిని విడతల వారీగా 4జీ టవర్లుగా మార్చనున్నారు.

వర్షాకాలం బంపర్ ఆఫర్లు

మాన్‌సూన్ ఆఫర్ ద్వారా కొత్తగా కనెక్షన్ తీసుకునే వారికి ఆ నెలలో పూర్తి ఉచితంగా సర్వీసును ఇస్తూ తర్వాత మూడు నెలలు రూ.50 లేదా రూ.100 డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఈ ఆఫర్‌తో ఫైబర్ బేసిక్ నియో ప్లాన్ (రూ.449 ప్లాన్) తీసుకున్న వారికి 50 ఎంబీపీఎస్ స్పీడుతో అన్‌లిమిటెడ్ డేటాను ఇస్తూ మొదటి నెల ఉచిత సర్వీసు, తర్వాత మూడు నెలలు రూ.50 డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఫైబర్ బేసిక్ ప్లాన్ తీసుకున్న వారికి 60 ఎంబీపీఎస్ స్పీడుతో అన్‌లిమిటెడ్ ఇంటర్‌నెట్‌తో పాటు మూడు నెలలు రూ.100 డిస్కౌంట్ ఇవ్వనున్నారు. ఈ మేరకు కర్నూలు, నంద్యాల, ఆదోని, ఎమ్మిగనూరు, డోన్ వంటి ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరాల్లో కస్టమర్ల సందడి కనిపిస్తోంది.

ఎఫ్‌టీటీహెచ్ ద్వారా అత్యంత వేగవంతమైన ఇంటర్‌నెట్‌సేవలు

ఫైబర్ టు ది హోమ్ ద్వారా 30 ఎంబీపీఎస్ నుంచి 300 ఎంబీపీఎస్ వరకు అత్యధిక స్పీడుతో రూ.449 నుంచి రూ.2200 వరకు వివిధ ప్లాన్ల ద్వారా ఫైబర్ ఇంటర్‌నెట్ సేవలను టెలికాం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్ విధానం ద్వారా త్వరితగతిన అందిస్తోంది.

బీఎస్ఎన్ఎల్‌కు పెరుగుతున్న ఆదరణ

భారత ప్రభుత్వ రంగ టెలికాం సంస్థ బీఎస్ఎన్ఎల్ పట్ల ఆదరణ పెరుగుతోంది. మొబైల్, ఫైబర్ ఇంటర్‌నెట్ సేవల్లో బీఎస్ఎన్ఎల్ గణనీయమైన అభివృద్ధి సాధించింది. ఇటీవల ప్రైవేటు టెలికాం కంపెనీలు భారీగా టారిఫ్‌లు పెంచడంతో మొబైల్ వినియోగదారులు భారీ ఎత్తున బీఎస్ఎన్ఎల్ సర్వీస్‌కు పోర్ట్ ఇన్ అవుతున్నారు. కొత్త కస్టమర్లు కూడా బీఎస్ఎన్ఎల్ సర్వీసులను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నారు.

–జి.రమేష్,జనరల్‌మేనేజర్, బీఎస్ఎన్ఎల్, కర్నూలు

అభివృద్ధి పనుల పరిశీలన



కమలానగర్‌లో పద్మమ్మకు పింఛన్ అందిస్తున్న కమిషనర్ రామలింగేశ్వర్

కర్నూలు (టౌన్): నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను గురువారం నగరపాలక కమిషనర్ రామలింగేశ్వర్ పరిశీలించారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమంలో భాగంగా పాతబస్తీ, కలెక్టరేట్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి, సెట్కూర్ కార్యాలయం, పరిమళ నగర్‌లలో పనులను పరిశీలించారు. అలాగే అన్న క్యాంటీన్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 5వ తేదీ లోపు అన్న క్యాంటీన్ల పనులు పూర్తి చేయాలన్నారు. రోడ్ సేఫ్టీ కమిటీ నిర్ణయం మేరకు రూ.50 లక్షలతో బళ్లారి చౌరస్తా వద్ద గ్రీనరీ ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. అలాగే ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరణను పరిశీలించారు. మాధవీనగర్, బంగారు పేట, బళ్లారి చౌరస్తా ప్రాంతాలలో కమిషనర్ పర్యటించి పూడిక తీత పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు.

98 శాతం పింఛన్ల పంపిణీ

నగరంలో గురువారం పింఛన్ల పంపిణీ ప్రారంభమైంది. సాయంత్రం సమయానికి 98.20 శాతం మందికి పింఛన్లు పంపిణీ చేశారు. నగరంలోని 51వ సచివాలయం పరిధిలోని కమలానగర్‌లో మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్ పెన్షన్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఒక్కరోజులోనే వంద శాతం పింఛన్లు పంపిణీ చేసేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఆస్పత్రిలో సూచిక బోర్డుల ఏర్పాటుకు కృషి



ఆసుపత్రిలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తామని సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి చెప్పారు. ఆయన గురువారం ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించారు. శుశ్రుతభవన్, పురుషుల ఎంఎం-1, 2, సర్జికల్ బ్లాక్, డైట్ విభాగం, డీవీఎల్, బాలాజీ క్యాంటీన్, విజయ మిల్క్ బూత్, క్యాజువాలిటీ తదితర విభాగాలను తనిఖీ చేశారు. ఫిమేల్ మెడికల్ వార్డు వద్ద పాత బాత్‌రూమ్‌లను డిమాలిష్ చేయాలని ఏపీ ఎంఎస్ఐడీసీ ఇంజినీర్లను ఆదేశించారు. బాలాజీ క్యాంటీన్ వద్ద డ్రైనేజీ పూడిక తొలగించాలని, ఫిమేల్ వార్డు వద్ద పార్కింగ్ ప్లేస్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్యాజువాలిటీలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి ఆరా తీశారు. సీఎస్ఆర్ఎంఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ హేమనళిని, ఏఆర్ఎంఓ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్స్ శివబాల నాగాంజన్, కిరణ్‌కుమార్, ఏఓ శ్రీనివాసులు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పుపై హర్షం



అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

కర్నూలు (అర్బన్): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి దశాబ్దాలుగా చేస్తున్న ఉద్యమాల వల్లే ఏ, బీ, సీ, డీ వర్గీకరణ సాధ్యమని ఎంఆర్‌పీఎస్ నాయకులు పేరపోగు లక్ష్మన్న అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సంబంధించి సుప్రీంకోర్టు సంచలన తీర్పు ఇచ్చిందన్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం సాయంత్రం ఎంఆర్‌పీఎస్ నేతలు స్థానిక పాతబస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ ఉద్యమంలో అమరులైన వారి ఆత్మ శాంతికి మౌనం పాటించారు. ఎంతో మంది ఎంఆర్‌పీఎస్ కార్యకర్తల ప్రాణ త్యాగంతోనే వర్గీకరణ కల సాకారమవుతోందన్నారు.

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ ఉమ్మడి రిజర్వేషన్లలో ఏ, బీ, సీ, డీ వర్గీకరణపై రాష్ట్ర ప్రభుత్వాలకు అధికారం కల్పిస్తూ గురువారం సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల ధర్మాసనం 6:1 నిష్పత్తిలో తీర్పు వెలువరించడం పట్ల కర్నూలు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె.బాబురావు హర్షం వ్యక్తం చేశారు. గురువారం పత్రికా ప్రకటన విడుదల సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదిగలు, ఇతర ఉపకులాల 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ఫలించిందన్నారు. ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి మాదిగ కులాలకు న్యాయం చేసే బాధ్యత తీసుకుంటామని రేవంత్ రెడ్డి హామీ ఇవ్వడం హర్షించదగ్గ విషయమని, అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వర్గీకరణకు కట్టుబడి పనిచేయాలని కోరారు.

కల్లూరు తహసీల్దార్‌గా ఆంజనేయులు



తహసీల్దార్‌కు స్వాగతం పలుకుతున్న డిప్యూటీ తహసీల్దార్

కల్లూరు: కల్లూరు తహసీల్దార్‌గా కె.ఆంజనేయులు గురువారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అనంతపురం జిల్లాకు బదిలీపై వెళ్లిన ఎమ్మిగనూరు తహసీల్దార్ కె. ఆంజనేయులును ఉన్నతాధికారులు కల్లూరుకు నియమించారు. కల్లూరులో సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వర్తించిన తహసీల్దార్ మునివేలుసొంత జిల్లా అనంతపురానికి బదిలీ అయ్యారు.ఆయనకు డిప్యూటీ తహసీల్దార్ శివరామ్, ఆర్ఐ రాజేంద్రప్రసాద్, వీఆర్వోలు, సిబ్బంది తహసీల్దార్ మునివేలును ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. నూతన తహసీల్దార్‌గా నియమితులైన ఆంజనేయులకు సాదరంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఓఆర్డి రవికిషోర్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నాడు-నేడు పనులను అడ్డుకున్న టీడీపీ నాయకులు

గోనెగండ్ల: ఓ టీడీపీ నాయకుడి దౌర్జన్యం కారణంగా మండల కేంద్రం గోనెగండ్లలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు పనులు నిలిచిపోయాయి. పాఠశాలలో నాడు-నేడు కింద మూడు అదనపు తరగతి గదుల నిర్మాణానికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.36 లక్షలు కేటాయించింది. పనులు కూడా ప్రారంభమయ్యాయి. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనుల్లో కొంత జాప్యం సాగింది. అనంతరం కూటమి ప్రభుత్వం ఏర్పాటైంది. తరువాత పాఠశాలలో పనులను మొదలుపెట్టగా ఓ టీడీపీ నాయకుడు పనులను తానే పూర్తి చేస్తానని, ఇంకెవరు పనులు చేపట్టరాదని అడ్డుకున్నాడు. నియోజకవర్గం టీడీపీకు చెందిన ఓ ప్రజా ప్రతినిధితో సంబంధించిన అధికారులకు ఫోన్ చేయించాడు. ఆ పనులు మా వాడు చేస్తాడు. ఇంత వరకు మీరు చేసింది చాలు అంటూ ఇంత ముందు పనులు చేసిన వారిని టీడీపీ నేత బెదిరించినట్లు తెలిసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో విడుదలైన నిధులతో జరుగుతున్న పనులను టీడీపీ నాయకులు నిలిపి వేయడం పట్ల పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు కలుగజేసుకొని పాఠశాల పనులు కొనసాగే విధంగా చూడాలని కోరుతున్నారు.

శ్మశాన వాటికలు ఏర్పాటు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కేవీ ఆనందబాబు

కర్నూలు(సెంట్రల్): దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడిచినా నేటికీ దళితవాడలకు శ్మశానాలు లేకపోవడం విచారకరమని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎండీ ఆనందబాబు, ఉపాధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక కారిత్మక, కర్షక భవన్‌లో కేవీపీఎస్ జిల్లాస్థాయి సామాజిక చైతన్య శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ తరగతులనుద్దేశించి వారు మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనం, అసమానతల మధ్య జీవనం సాగించాల్సిన పరిస్థితులు ఉన్నాయన్నారు. దళితులను ఆర్థిక సమస్యలు వెన్నాడుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదన్నారు. మనిషి చనిపోతే పూడ్చి పెట్టడానికి కూడా నేటికీ శ్మశానవాటికలు ఏర్పాటు చేయలేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ మాట్లాడుతూ.. దేశం, రాష్ట్రాల్లో దళితులపై దాడులు అధికమయ్యాయన్నారు. మహిళలపై అత్యాచారాలు, హత్య లు పెరిగిపోతున్నా అరికట్టేందుకు చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. ఎన్ని చట్టాలు ఉన్నా వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాల్లో చిత్తశుద్ధి కనిపించడం లేదన్నారు. కార్యక్రమంలో ఎం.భాస్కర్, ఎన్‌జీ కృష్ణ,డి.విజయ,పెద్దబాబు, గురుస్వామి పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



తల్లిపాల వారోత్సవాల పోస్టర్‌ను ప్రదర్శిస్తున్న దృశ్యం

కర్నూలు(హాస్పిటల్): శిశువుకు తల్లిపాలు ఇవ్వడం వల్ల బిడ్డతో పాటు తల్లికి కూడా ఆరోగ్య రక్షణ ఉంటుందని కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ తెలిపారు. గురువారం 'ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ప్రసూతి విభాగంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. శిశువు జన్మించిన గంటలోపు తల్లిపాలు పట్టాలని, తద్వారా బిడ్డలకు మంచి ఆరోగ్య రక్షణ ఏర్పడుతుందని తెలిపారు. అంతేగాక తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా రక్షణ ఉంటుందని చెప్పారు. తల్లిపాలలో బిడ్డకు కావాల్సిన పోషక విలువలు ఉంటాయని, వారి ఆరోగ్య రక్షణకు యాంటిబాడీస్ కూడా ఉంటాయని, కావున తల్లులు విధిగా తమ పిల్లలకు ఆరు నెలల పాటు పాలు ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన పిల్లలను ఈ సమాజానికి ఇచ్చిన వారవుతారని, పిల్లలు భవిష్యత్‌లో ఆరోగ్యంగా పెరుగుతారని వివరించారు. అనంతరం ఆ విభాగంలోని టీచింగ్ రూమ్స్, లైబ్రరీ విభాగాలను ప్రిన్సిపాల్ పరిశీలించారు. ల్యాప్రోస్కోపిక్ స్టిమ్యులేటర్ మిషన్‌ను పరిశీలించి ఎలా ఉపయోగించుకుంటున్నారని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రొఫెసర్లు సావిత్రి, పద్మజ, వరలక్ష్మి, అసోసియేట్ ప్రొఫెసర్ ఉమాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ మమత, నర్మద తదితరులు పాల్గొన్నారు.

ముజఫర్ నగర్‌లో...

ప్రపంచ తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని కల్లూరు ఎస్టేట్‌లోని ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీలో డెమో శ్రీనివాసులు ఆధ్వర్యంలో ర్యాలీ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల ఒకటి నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగా 'అంతరాలు పూరించి-తల్లిపాల సంస్కృతిని ప్రోత్సహిద్దాం' అనే నినాదంతో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. వైద్యాధికారి డాక్టర్ సుప్రియ, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు కల్చరల్: తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని, వాటితో శిశువులు ఆరోగ్యంగా ఉంటారని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమ అధికారి హేమలత అన్నారు. కర్నూలు మండలం పసుపుల గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లి పాల ప్రాముఖ్యతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు గంటలోపు ముర్రుపాలు తాగించడంతో అనేక ప్రయోజనాలు ఉంటాయన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో కలిసి గ్రామంలోని గృహాలను సందర్శించి గర్భవతులు, బాలింతలకు పౌష్టిక ఆహారంతో కలిగే ప్రయోజనాలను వివరించారు. సామాజిక ఆరోగ్య అధికారి నమ్రతా, అంగన్‌వాడీ సిబ్బంది సువర్ణమ్మ, ఆశా కార్యకర్త లక్ష్మీదేవి, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేయండి

కర్నూలు: జిల్లాలోని ఎత్తిపోతల పథకాలకు నిధులు మంజూరు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని కర్నూలు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి శ్రీశైలం పర్యటనకు వచ్చిన సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. మంత్రాలయం గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకానికి సంబంధించిన పరికరాలను కొంతమంది దుండగులు ధ్వంసం చేశారని, వాటి మరమ్మతులకు ప్రభుత్వం తక్షణమే నిధులు విడుదల చేసి రైతులకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఎల్ఎల్‌సీ ఆయకట్టుకు నీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని ఇతర ఎత్తిపోతల పథకాలన్నింటికీ నిధులు విడుదల చేసి రైతులకు ఇబ్బంది లేకుండా ఆదుకోవాలని కోరారు. అలాగే కర్నూలు పార్లమెంటు పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీకి సంబంధించిన విషయాలపై సీఎంకు మరో వినతిపత్రం అందజేశారు. జిల్లాలో పార్టీకి పని చేసిన కొంతమంది పదవులను ఆశిస్తున్నారని, అలాంటి వారికి నామినేటెడ్ పదవులలో అవకాశం కల్పించి ప్రోత్సహించాల్సిందిగా కోరారు.

రగ్బీ అంతర్ పాఠశాలల పోటీలు

కర్నూలు (టౌన్): ఈనెల 8వ తేదీ నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి జిల్లా స్థాయి (కర్నూలు, నంద్యాల) రగ్బీ అంతర్ పాఠశాలల పోటీలు నిర్వహించనున్నట్లు రగ్బీ సంఘం కార్యదర్శి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-15 విభాగంలో ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2009 - 2012 మధ్య జన్మించిన వారు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు. విజేతలకు కప్పుతో పాటు మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు తెలిపారు. పాల్గొనే క్రీడాకారులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు కూడా ఇస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు సెల్ నంబర్ 93938 27585ను సంప్రదించాలన్నారు. పాఠశాలలు తమ ఎంట్రీలను ఈనెల 5వ తేదీ సాయంత్రంలోపు అందజేయాలని కోరారు.

8న హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): ఈ నెల 8వ తేదీన నగర శివారులోని ఆదర్శ విద్యా మందిర్ క్రీడా మైదానంలో జూనియర్స్ అండర్ -19 విభాగంలో బాల బాలికల జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా హ్యాండ్‌బాల్ సంఘం కార్యదర్శి సువర్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2005 నుంచి 2009 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు.ఎంపికైన క్రీడాకారులు ఈనెల 17,18 తేదీల్లో కదిరి పట్టణంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి జూనియర్స్ హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా గిడ్డయ్య



కర్నూలు (టౌన్): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) జిల్లా కార్యదర్శిగా గిడ్డయ్య నియమితులయ్యారు. జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ ఆయన్ను నియమిస్తు ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా ఎంపికైన ఆయన కల్లూరు మండలం లక్ష్మీపురం గ్రామంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్ ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన రెండేళ్ల పాటు స్కూల్ గేమ్స్ కార్యదర్శిగా వ్యవహరించనున్నారు.

క్రీడా సంఘాల సన్మానం : నూతనంగా ఎస్‌జీఎఫ్ కార్యదర్శిగా ఎంపికైన గిడ్డయ్యను గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో క్రీడా సంఘాల ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. జిల్లా ప్రైవేటు పీఈటీల సంఘం అధ్యక్షుడు చిన్న సుంకన్న, జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

డబ్బు కోసమే బంగారం వ్యాపారి కిడ్నాప్



కిడ్నాపర్ల అరెస్ట్‌ను చూపుతున్న కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్

కోడుమూరు రూరల్: గూడూరులో బంగారు వ్యాపారి డమామ్ వెంకటేష్‌ను కిడ్నాపర్లు కేవలం డబ్బు కోసం కిడ్నాప్ చేసినట్లు కోడుమూరు సీఐ మన్సూరుద్దీన్ వెల్లడించారు. బంగారు వ్యాపారిని కిడ్నాప్ చేసిన ఇద్దరు కిడ్నాపర్ల అరెస్ట్ వివరాలను గురువారం సాయంత్రం సీఐ మన్సూరుద్దీన్ గూడూరు పీఎస్‌లో విలేకరులకు వివరించారు. వ్యాపారి డమామ్ వెంకటేష్‌ను పొన్నకల్ చెందిన బోయ కొండయ్య, పెద్దపాడుకు చెందిన గాండ్ల నరసింహులు మరో వ్యక్తితో కలిసి జూలై 29వతేదీ సాయంత్రం స్కార్పియో వాహనంలో గూడూరులో కిడ్నాప్ చేశారన్నారు. వీరి కోసం కోడుమూరు, గూడూరు, కె.నాగలాపురం, ఎమ్మిగనూర, కర్నూలు పోలీసులు బృందాలుగా ఏర్పడి సెల్‌ఫోన్ల సిగ్నల్స్ ఆధారంగా అదేరోజు అర్ధరాత్రి దాటిన తర్వాత ప్యాలకుర్తి, చనుగొండ్ల గ్రామాల మధ్య పొలాల రస్తాలో ట్రేస్ చేసి పట్టుకున్నారు. దీంతో నిందితులు వాహనాన్ని,కిడ్నాప్ చేసిన డమామ్ వెంకటేష్‌ను వదిలేసి పారిపోయారు. పరారీ ఉన్న కిడ్నాపర్ల పోలీసులు తీవ్ర గాలింపు నిర్వహించారన్నారు. ఈ మేరకు గురువారం నిందితులైన బోయ కొండయ్య, గాండ్ల నరసింహులును వర్కూరు గ్రామ సమీపంలో పట్టుకున్నట్లు సీఐ వెల్లడించారు. కాగా కిడ్నాప్ కేసులో ప్రధాన నిందితుడైన మరో వ్యక్తి, వారికి సహకరించిన వ్యక్తుల కోసం ఇంకా గాలిస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు. సమావేశంలో గూడూరు ఎస్ఐ హనుమంతప్ప పాల్గొన్నారు.

ఎస్పీకి సత్కారం



ఎస్పీ బిందుమాధవ్‌ను సత్కరిస్తున్న గూడూరు మండల బంగారు వ్యాపారులు

కర్నూలు: బంగారు నగల వ్యాపారి వెంకటేశ్వర్లు కిడ్నాప్ ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఎస్పీ బిందుమాధవ్ తెలిపారు. గూడూరు మండలానికి చెందిన బంగారు వ్యాపారులు, పలువురు ప్రముఖులు గురువారం ఎస్పీ బిందుమాధవ్‌ను జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. కిడ్నాప్ ఘటనపై పోలీసులు స్పందించి చర్యలు తీసుకుని వెంకటేశ్వర్లు ప్రాణాలు కాపాడినందుకు ఎస్పీకి కృతజ్ఞతలు తెలియజేశారు. డబ్బు కోసమే వెంకటేశ్వర్లును కిడ్నాప్ చేశారనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోందన్నారు. సాంకేతికతను వినియోగించి కిడ్నాప్ కేసును పది గంటల్లోనే ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించగా ఈ ఘటనలో పోలీసుల చర్యల పట్ల బంగారు వ్యాపారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటాలి

కర్నూలు (టౌన్): ఈనెల 17 నుంచి 19వ తేదీ వరకు శ్రీకాకుళం జిల్లాలో నిర్వహించనున్న 11వ రాష్ట్రస్థాయి జూనియర్స్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ చాటాలని జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు సూచించారు. గురువారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో రాష్ట్ర పోటీల్లో పాల్గొనే జట్టును అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా సాఫ్ట్‌బాల్ క్రీడాకారులు ఉత్తమంగా రాణించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం ఆ సంఘం కార్యదర్శి విజయ్‌కుమార్ ఎంపికైన జట్టు వివరాలు ప్రకటించారు.